# రతనాలు

ముగ్గురు కుమార్తెల తరవాత పుట్టిన నా కొడుకు బారసాలకు వచ్చి, అలవాటు లేని ఈ ప్రదేశంలో అమ్మమ్మ బాత్‌రూమ్‌లో జారి కుడికాలు విరగ్గొట్టుకుంది. మంచంమీద ఉన్నప్పుడు రోజూ ఆఫీసు నుంచి రాగానే కాస్సేపు దగ్గర కూర్చుని మాటాడేవాడిని. మూడో రోజు చావు పుట్టుకల మాట వచ్చి చప్పున ఆమె కొన్ని మాటలు జారవెయ్యగానే నా శరీరం పులకరించింది. ఇన్నాళ్ళూ దూరంగా ఉండి ఈమెను శ్రావణ భాద్రపదాల్లో దూరపుకొండ కనిపించినంత మనోహరంగా నా మనసులో సృష్టించుకున్నాను. కొన్ని నెలలు తొలిసారి ఆమెకు దగ్గరగా ఉండే అవకాశం ఇప్పుడు దొరికింది కాబట్టి నిత్యం నవ్వగలిగేటట్లు తీర్చిదిద్దిన ఆమె అనుభవాన్ని తెలుసుకోవాలని భీష్మించుకున్నాను.

"నీ గురించి చెప్పవా?" అని అడిగాను.

"నా గురించి నేను చెప్పకోవడానికి ఏముంది మనవడా?" అని నవ్వుతూనే తేల్చేసింది. ఆ మరుసటి రోజు మా ఆఫీసులో ఆ రోజే చచ్చినవాని గురించి చెబుతూ, వాడు పడ్డ కష్టాలను కల్పించి మరీ చెప్పాను.

"రామ రామ" అంది. తరవాత మవునం దాల్చి, బహుశః ఒకనాటి తన జీవితంలోని అఘాతాలను, గాలి వానలను గుర్తు చేసుకుంటుందేమోనని – "నీ మారటి తల్లి నిన్ను నానా తిప్పలు పెట్టింది కదూ?" అన్నాను.

"నీ కెవరు చెప్పారు?" ఎదురు ప్రశ్న వేసింది.

"ఎవరో చెప్పారులే– నిజం నీ ద్వారా తెలుసుకుంటేనే మంచిది."

"ఆ బాధను ఏనాడో పాతి పెట్టేశాను. ఇప్పుడు తెలుసుకుంటే నీ కేం వస్తుంది?"

"పుట్టి, బతికి, చచ్చిన ప్రతి మనిషి జీవితాన్ని పరీక్షిస్తే ఏదో ఒక సందేశం దొరుకుతుంది కదా!" అన్నాను.

నవ్వేసింది. ఆ నవ్వు నా తెలివి తేటలను సవాలు చేస్తున్నట్లుంది. నాకు చదువుతో అనుమానాలు హెచ్చయ్యాయి. కానీ తగ్గలేదు. ఖచ్చితంగా ఈ ప్రశ్నకు ఇది సమాధానం అని చెప్పలేకపోయే అజ్ఞానంలో చిక్కుకున్నాను. మరుసటి రోజు ఆమె నోట ఆమె జీవితం వింటేకానీ నా అజ్ఞానం కొంతలో కొంతైనా తరగ దనుకున్నాను.

"మారటి తల్లి నిన్ను రంపాన పెట్టి రాపాడేసి, వాడి గోళ్ళతో రక్కేసి, తిట్టి, కొట్టి తగిలేస్తే మీ నాన్న నోరు మూసుకుని వూరుకున్నా డటగా?"

"నా గురించి ఎప్పు డిదంతా తెలుసుకున్నావ్?"

"అమ్మ చెప్పింది."

"ఎప్పుడు?"

"నిన్ననే."

"పొరుగునే ఉన్న నా పినతండ్రి నన్ను చేరదీశాడు. పెళ్ళి చేశాడు. ఇదే నాకు జ్ఞాపకం ఉన్నది" అంది నవ్వుతూ.

ఆమె నవ్విన నవ్వు పొల్లు నవ్వు కాదని అర్థం చేసుకుంటే అనేక సత్యాలను చూస్తాం అనిపించింది.

"మరి మీ ఆయన–మా తాతయ్య–నీతో సరదాగా ఉండేవారా?" అని ఇంకో రోజు అడిగితే, జవాబు చెప్పలేకపోగా మా అమ్మను అడిగాను.

"తాతయ్య అమ్మమ్మను కొట్టేవారా?"

"లేదట."

"తిట్టేవారా?"

"లేదట."

ఆ మరుసటి రోజు అమ్మమ్మతో సరదాకి అన్నాను–"నాకు తెలుసులే–తాతయ్య నిన్ను చాలా అవమానపరచాడు." అప్పుడు చప్పున ఉద్వేగంతో కదిలినట్లు లేచి, నా వేపు నిదానంగా చూసింది.

ఆ ఎనభయేళ్ళ వయసులోని ఆ చూపు వేపు చూస్తుంటే మా అమ్మమ్మ వయసులో అపురూపమైన, అందమైన కళ్ళతో మెరిసిపోయేదనిపించింది. మళ్ళీ చారబడుతూ కాస్సేపయ్యాక–

"అవమానాలైనా, కష్టాలైనా ఎలా భరిస్తాం? రెండే మార్గా లున్నయ్."

ఆ మార్గాలను కోరితేకాని చెప్పింది కాదు. మరిచిపోతానేమోనని వెంటనే రాసుకున్నాను. మరుసటి రోజు ఆఫీసులో ఒక డ్రాయింగు పేపరు మీద, ఇండియన్ ఇంకుతో ఆ అవమానాలను, కష్టాలను భరించే రెండు మార్గాలను రాసి, ఏది కావాలో ఎంచుకో అని చేర్చి, టేబిల్మీద పరిచిన గాజు పలక కింద నిత్యం కనపడాలని పెట్టుకున్నాను.

"నీ మొగుడు తుమ్మెదలా ఝుమ్మని నిన్ను అవమానపరిచాడు. నీ నాన్న లోభంలో మునిగి నీ దగ్గరకొచ్చి చచ్చాడటగా?" అన్నాను.

"ఇదేమిట్రా? నా గురించి తెలుసుకుని నా అభిప్రాయం అడుగుతున్నావ్? నా గురించి పేపర్కెక్కిస్తావా?" అంది.

"అమ్మమ్మా! 'మోనాలిసా' అని ఒక గొప్ప చిత్రం ఉంది. ఆ మోనాలిసా ఎందుకు చిరునవ్వు నవ్వుతుందో చెప్పలేం. కానీ నీ చిరునవ్వుకు కారణం తెలుసుకోకుండా నిన్ను ఇక్కడనించి పంపేది లేదు."

"ఎవరు ఎందుకు నవ్వుతారో, ఎందు కేడుస్తారో ఆ నవ్వినవాళ్ళే, ఏడ్చేవాళ్ళే సరిగ్గా చెప్పలేరు."

"ఏం?"

"నవ్వలేక ఏడ్చేవాళ్ళు, ఏడవలేక నవ్వేవాళ్ళుంటారురా!"

"అయితే ఏడవలేక నువ్వు నవ్వుతున్నావన్నమాట?"

అమ్మమ్మ పెద్దగా నిట్టూర్చింది. అంతే! ఆ రోజుకి మరి మాటాడలేదు. ఈ దూరపు కొండకు ఇప్పుడే దగ్గరై ఈ లోయల గుండా పైకి ఎగబాకుతున్నాననిపించింది. ప్రతిరోజూ నన్ను ఆలోచనలలో ముంచివేస్తూంది. మరుసటి రోజు...

"మీ నాన్న గుండె ఆగి చచ్చిపోయాడా?" అన్నాను.

"అందరికీ చచ్చేటప్పుడు గుండె ఆగిపోతుంది. మా నాన్న బతికుండగానే 'నా గుండె ఆగిపోతూందో' అని అరిచేవాడు."

"ఎందుచేత?"

"చావంటే ఎంత భయమో? రాత్రింబవళ్ళు దగ్గర కాసుకుని కూర్చునేదాన్ని. గుండె ఫట్టుకునే తనకు అక్కర చేయని నా మారటి తమ్ముళ్ళ గురించి, అతనిని నానా హింసలు పెట్టి చచ్చిన మారటి తల్లి గురించి గొలికిందే గొలుకుతూ, చెప్పిందే చెప్పుతూ ఏడుస్తూ ఉండేవాడు. అంత ఏడుపులోనూ, అదెవడో అరణాల వడ్డీ బాకీ ఉన్నాడని, వసూలు చేస్తావా లేదా అని మారాం చేసేవాడు. పోనిద్దూ అంటే, లోకం అంతా తనను మోసం చేసిందని పేరు పేరునా నిందించేవాడు. విని వినీ నేను నీరసించిపోతే, నాకు తండ్రిమీద కనికరం లేదన్నాడు. ఎప్పుడు ఈ బరువు దిగుతుందని చూస్తున్నాననేవాడు. మంచం పట్టిన ఆరు నెలల్లో ఒకర్ని మంచి అనలేదు. నాకు మాత్రం నా నాన్న మంచే. నాకో రూపు ప్రసాదించాడు. నా ఆకారానికి హంగులాంటి బుద్ధిని పంచుకో నిచ్చాడు. కూతురిగా సేవ చేసి ఋణం తీర్చుకున్నానన్న తృప్తిని పొందనిచ్చాడు."

ఇంత వివరంగా ఒక విషయాన్ని చెప్పగానే ఇంతవరకు ఈమె జీవితంలో క్రోధంతో మారటి తల్లి, కామంతో కట్టుకున్న మొగుడు, లోభంతో కన్న తండ్రి పెట్టిన యమయాతనను వూహించుకోగలిగాను. ఇక మదమాత్సర్యాలతో ఎవరీమెను వేధించారో తెలుసుకోవాలని మా అమ్మనే ఆ విషయం అడిగితే-

"ఇంకెవరురా? ఒకే కోడలు. ఇప్పటికి దాని దర్జా ఇంతా అంతా కాదు. ఒకసారి వెళ్ళి చూడు. మదంతో అత్తగారి చేత ఎంత బానిస పని చేయిస్తుందో? మా అమ్మ ఆ ఇంట్లో ఒక పనిమనిషికన్నా అధ్వాన్నం," అంది

"అయితే మన ఇంట్లో ఉంచేస్తే?"

"కూతురింట్లో ఉంటానా? కర్మ చేసే కొడుకుని వదులుతానా అంటుంది. పోనీ, ఏదైనా ఇస్తామా అంటే పుచ్చుకోదు. ఒకప్పుడు పుచ్చుకుందీ అంటే అదెవరికో లేనివాళ్ళకి దానం చేసేస్తుంది. ఎందుకలా చేశావంటే, వూర్లో ఎవరు పుట్టినా నీ చేత గుడ్డ పాత ఇయ్యి తల్లీ, నీ ఆయుస్సు పోసుకుంటారని వస్తారట. ఎవరు చచ్చినా స్వయంగా వెళ్ళి ఏదో ఒకటిచ్చి ఏడ్చేవాళ్ళను ఓదారుస్తుందట! నువ్వింత భవంతిలో రబ్బరు పరుపుమీద పడుకోపెట్టినా అక్కడున్న సుఖం, తృప్తి ఇక్కడెక్కడొస్తుంది? వెళ్ళిపోతా నంటుంది."

అమ్మమ్మ వెళ్ళిపోయే ముందు డాక్టరు అన్నాడు: "బాధలో ఆమె నవ్విన నవ్వే ఆమెను వేగంగా కోలుకోనిచ్చింది."

అమ్మమ్మ వెళ్ళిపోతూ "బతికించావు ఇంకెంత కాలం ఉండిపోతాను" అంటే,

"నువ్వు చెప్పిన నిజాన్ని తెలుసుకోవడానికి అప్పుడు వస్తానులే" అన్నాను.

"అయితే నువ్వు వచ్చేవరకూ ఎదురు చూస్తాను." చావు తను చెప్పినట్లు వింటుందన్నట్లు ధీమాగా చెప్పింది.

తిరిగి వెళ్ళాక ఏడాది దాటింది.

అమ్మమ్మకు చావు కేక వినిపించక ముందే నాకు కబురు వస్తుందని ఎదురు చూశాను. నేను ఆ గ్రామం వెళ్ళేసరికి సాయంత్రం అయిపోయింది. అమ్మమ్మ వరండాలో స్పృహ తప్పి ఉంది. దగ్గర అలా కూర్చున్నాను. రాత్రయినా వూర్లో ఆడవాళ్ళు కొందరు కూర్చున్నారు. కొందరు మగవాళ్ళు నిల్చున్నారు. మవునంగా వాళ్ళు అనుకున్న మాటలు వింటున్నాను.

"మా తల్లి! సీదా సాదా మనిషి కాదు. అందుకే సెప్పి సెప్పి సచ్చిపోతన్నాది."

"నిన్న పొద్దున్న ఏటిలో మునిగి రావటం సూసినాను. ఇంటికొచ్చి పూజ సేసుకున్నాదట. పలారం సేసుకున్నదట. ఒక కొత్త బట్ట కట్టుకున్నాదట. ఇంకొక కొత్త బట్ట ఎల్లుండి కట్టబెట్టమని కోడలితో సెప్పిందట. ఏ మూలో దాసుకున్న పైసలు తీసి అడుక్కున్నోల కిచ్చిందిట. మాలాంటి బీదా బిక్కీకి పిలిసి ఉన్న బట్టా పాతా-పైసా పరకా-ఉండా పందూ అంతా పంచిపెట్టేస్తంటే 'ఇదేటమ్మా ఇయేళే అంతా యెచ్చబెట్టేస్తన్నా' వన్నాను. పండగ సేసుకుంటున్నానే అన్నాది మా తల్లి. పుట్టుక సంబరం గానీ, ఈ సావు సంబరమా?"

అర్ధరాత్రి వరకూ అలా కూర్చుని ఏడాది ముందు నా ఇంట్లో ఆమెతో గడిపిన రోజులు నిన్నా మొన్నా ఈవేళనే గడిపినట్లు తలుచుకుంటున్నాను.

ఇదివరకు అవమానాలను, కష్టాలను ఎదుర్కోలేక, మనసులో హీనపడి ముడుచుకు పోయేవాడ్ని. ఒకోసారి ఎందుకో అర్థంలేకుండా విసుక్కునేవాడిని.

అమ్మమ్మ అవమానాలు, కష్టాలు రెండు విధాలుగా భరించవచ్చునని చెప్పింది. ఒకటి- నీకు నువ్వే కనికరించుకుని అదేపనిగా ఏడవటం. రెండవది- ఓర్పుతో నవ్వి భరించటం. ఈ రెండోది ఎంచుకోవటం వలన ఈ ఏడాదిలో నాలో నాకే మార్పు కనిపించింది. భరించిన కష్టాలు బలాన్ని చేకూర్చాయి. బలంతో ముందడుగు వేశాను. నేను మారానని నా కింద పనిచేసే ఉద్యోగుల్లోనే అనుకుంటున్నారు.

అర్థరాత్రి దాటాక అమ్మమ్మ పలవరింతలు విన్నాను. "చిత్రగుప్తుడు నోము నోచానురా! నా మనుమడు వచ్చేవరకూ నన్నూ ముట్టుకోకండి. పొండి. పొండి" అని కసురుతూంది. నేను అమ్మమ్మ చెవిదగ్గర నోరుపెట్టి-

"అమ్మమ్మా! శంకరాన్ని వచ్చాను-వచ్చాను" అని అరిచాను. కాస్సేపయ్యాక కళ్ళు విప్పలేదు కానీ "జామిచెట్టుమీద రథం ఉంది. రమ్మని పిలుస్తున్నారు. మరి నీకు మాట ఇచ్చాను," అంది.

"అలాగే పరాకు మాటలు వస్తుంటాయ్" అంది మా అత్తయ్య.

ఇంతలో నలుగురు కలిసి భజన చెయ్యటం మొదలుపెట్టారు.

"ప్రాణం ఉండగా ఇదేమిటి? ఆపండి" అన్నాను. వాళ్ళు ఆపగానే మా అత్తయ్య అమ్మమ్మ కోర్కెనిలా చెప్పింది:

"సంకీర్తనలతో భజన చెయ్యండి–వింటుంటాను. పుట్టినప్పుడు నేను పండగ చేసుకోలేను కదా! చచ్చినప్పుడు చేసుకోనివ్వండి!"

సంకీర్తనలు జరుగుతుండగా ఆడుతున్న వూపిరి తెలతెలవారుఝామున నిలిచి పోయింది. మంచి చేసినవాళ్ళను మరిచిపోలేని వూపిరి, చెడు చేసినవాళ్ళను క్షమించగలిగే వూపిరి. కష్టాలను నవ్వుతూ ఎదుర్కొనే వూపిరి. ఈ వూపిరి–ఈ ప్రాణం పండగ చేసుకుంటూ పిట్టలా తుర్రున ఎగిరిపోయింది. మా అమ్మమ్మ బతుకుబాటలో నాలా వెనక వచ్చేవారికి ఏరుకోమని రతనాలవంటి వూహలను వదిలివెళ్ళింది.

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 4-4-84)*

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 4-4-84)

❈ ❈ ❈